# మినీకథ



## అమెరికాలో బుడుగు

కాలిఫోర్నియాలో ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ రామం. ఆయనకి ఇద్దరు పిల్లలు ఆనంద్, కాత్యాయిని. కాత్యాకి అయిదేళ్ళు నిండాయి.

ఒక రోజు వాళ్ళింటికి ఒక తెలిసినాయన వచ్చారు. అప్పుడు రామం ఇంట్లో లేరు. ఆయనకోసం నిరీక్షిస్తూ, ఎదురుగా బొమ్మల పుస్తకం చూస్తూ కూచున్న కాత్యాని చూశారు. ''నీ పేరేమిటి?'' వగైరా ప్రశ్నలు వేశాక ''వాడ్డూయు వాంట్ టుబి?'' అనడిగారాయన. అప్పటిదాకా అలాంటి ప్రశ్న కాత్యని ఎవరూ అడగలేదు! కళ్ళు పెద్దవి చేసి ''యు మీన్?'' అనడిగింది.

''ఐ మీన్... వాడ్డూయు వాంట్ టుబి వెన్ యు గ్రో అప్?''

తెలివితేటలు కొంచెం ఎక్కువ మోతాదులో వున్న కాత్య 'ఓహో! పెద్దయ్యాక ఏం కావాలనుకుంటే అది అవచ్చన్నమాట' అనుకుంది. పెద్దయ్యాక ఏమవాలో కాత్యా నిశ్చయించుకునే లోపే రామం తిరిగి రావడం, స్నేహితులిద్దరూ పనిమీద వెళ్ళిపోవడంతో కాత్యాకి సమాధానం చెప్పే అవకాశం రాలేదు.

తర్వాత చాలాసేపు ఆ విషయమే ఆలోచించింది కాత్యా. బొమ్మల పుస్తకం ముందుకీ వెనక్కీ తిరగేసి, 'ఐ వాంటు బీ ఎ కాట్' అనుకుంది. రామం తిరిగి వచ్చాక ఆయన ఒళ్ళోకెక్కి ''పపా! ఐ వాంటు బీ ఎ కాట్'' అంది. ఏదో పనిలో వున్న ఆయన ''ఐసీ! హౌ నైస్!'' అనేసి పనిలో పడిపోయారు.

మర్నాడు ఇండియానుంచి రామం దగ్గరి స్నేహితుడొకాయన మొదటిసారిగా అమెరికాకి వస్తూ వాళ్ళింటికి వచ్చారు. ఆయనకూడా తనను 'వాడ్డూయూ వాంట్ టుబి?'అనడిగితే ఏం చెప్పాలో తెలుసు కనుక ఆయనా ప్రశ్న అడిగితే బావుండు ననిపించింది కాత్యాకి. ఆయన చాలా ప్రశ్నలడిగారు. కాని, ఆ ప్రశ్న మాత్రం అడగలేదు. చాలాసేపు నిరీక్షించి చివరికి ''వాడ్డూయూ వాంటుబి?'' అని తనే అడిగింది ముద్దు పలుకులతో.

ఆయన ఆశ్చర్యపోయి ''వాట్?'' అన్నారు.

''ఐమీన్ వాడ్డూయూ వాంటుబి వెన్ యు గ్రో అప్'' అంది కాత్యా కళ్ళు విప్పార్చి ఆయన్నే చూస్తూ.

''అయామాల్‌రెడీ ఎ గ్రోనప్?'' అన్నారాయన కాత్యాని వింతగా చూస్తూ.

కాత్యాకి అర్థం కాలేదు. ఈయనకి ఇంకేమీ అవాలని లేదు కాబోలు అనుకుని ''ఐ మీన్... వాట్ బీస్ట్ డుయు వాంటుబి?'' అంది.

ఆయన ఆ పాప 'బాడ్ మానర్స్'కి చాలా నొచ్చుకుని ''అయ్ డోంట్ అండర్‌స్టాండ్ యు'' అని అటుగా వచ్చిన కాత్యా తల్లితో''మీ పాప ఉద్దేశ్యం నాకర్థం కాలేదు'' అని తమ సంభాషణంతా చెప్పారు.

''షీఈజె నాటీకిడ్''అని ఆవిడ కాత్యాని కోప్పడ్డారు.

కాత్యాకి చాలా కోపం వచ్చింది. 'పెద్దయాక ఏం కావాలనుకుంటే అది అవచ్చని చాలా మంది పెద్ద వాళ్ళకి తెలీదు కాబోలు! అందుకే వాళ్ళు మనుషులుగానే వుండిపోతున్నారు' అని అర్థం చేసుకుంది చివరికి.

—వారణాసి నాగలక్ష్మి

